# కళాజీవి

అతను, బహుశా, ఏ ఇరవయ్యోఏటనో, ఇంకా విద్యార్థిగానే వున్నప్పుడు మొదటిసారిగా కాగితంమీద బరుకుతాడు. తను చదివిన గొప్ప రచయితల సంపర్క, ప్రభావాలవల్లో, స్వతహాగా అప్పుడే తనలో జన్మిస్తున్న భావోద్రేకాల ప్రాబల్యంవల్లో ఆ రచన గొప్పదై తీరుతుంది. దేశమంతా హర్షిస్తుంది! అతని ప్రతీవాక్యమధ్యా గొప్ప భవిష్యత్‌ని చూస్తుంది. అది చదివిన ప్రతీమనిషీ ఆ వ్యక్తియొక్క గొప్పతనాన్ని గ్రహించనివాడుగా వుండగలగడం అసంభమవుతుంది. అతనికి కొంత పేరు ప్రఖ్యాతులు వస్తాయి.

కాని అతని స్నేహితులుమాత్రం ఆ రచనని చదివినట్టు కన్పించరు–రహస్యంగా చదువుతారు. అతను, వాళ్ళు చదివినట్టు తెల్సుకున్నప్పటికీ అభిప్రాయం చెప్పరు.

చివరికి విసిగి, విసిగి, అంటాడు:

"ఎట్లా వుందంటారు?"

"ఇప్పటి సాహిత్యాన్నిగురించే చెప్పుకోవాలి. చెప్పుకోగ, నెప్పుకోక! ఒకడికీ పొట్ట కోసినా అక్షరంముక్క వుండదు (దీనికి సైన్సే సమాధానం యిస్తుంది) అందులో మన సారస్వతం–తెలుగుది!"

స్నేహితుల మాటలు అతని గుండెల్లో గుచ్చుకుంటాయి శూలాల్లా. ఇండైరెక్టుగా "నువ్వు ఎందుకు పనికిరానివాడివి" అంటున్నాడు. అతని కళ్ళల్లో నీళ్లు తిరుగుతాయి. తను పడిన పరిశ్రమా, బుర్ర కాటెక్కించుకోడం అన్నీ గుర్తుకువస్తాయి. చివరికి, అది 'వొప్పుకోలేనితనం' అనే నిశ్చయానికి వస్తాడు.

రాయాలనే మానసిక వ్యధవల్లా, వొచ్చే పేరు ఇంకా వ్యాప్తి కావాలనే దుగ్ధవల్లా ఇంకా ఇంకా కలాన్ని సాగిస్తాడు. ఏదో కొన్ని తప్ప మిగతావన్నీ అదే సౌరభ్యంతో వెలువడుతాయి.

రచనానైపుణ్యాన్ని హెచ్చించుకుందుకూ, ప్రపంచకాన్ని, గొప్ప కళాజీవుల్నీ అర్థం చేసుకుందుకు ఎక్కువగా చదువుతాడు. కొన్ని ఏళ్ళలోనే అతని పేరు తగిన స్థానాన్ని అలంకరిస్తుంది. ఇదీ అతని కళనిగురించిన ప్రస్తావన.

కాని అతని నిజజీవితంలో పరిస్థితులు వేరుగా వుంటాయి. శక్తినంతా తన కళమీదే కేంద్రీకరించిన మూలాన, కాలేజీచదువు సన్నగిలుతుంది.

ఇంటిదగ్గర తండ్రి ఆర్థికంగా కుంగిపోతాడు. కొడుకుని ఇట్లాంటి తుక్కుభావాల నన్నిటినీ వొదులుకోమని పరిపరి విధాల వేడుతాడు, తిడతాడు. ఇంట్లోనించి తరిమేస్తాడు.

కాని మన మిత్రుడు చలించడు. సమాజానికి సేవజేస్తున్నాననుకుంటాడు. "అంతా పేరుకే! నీ కథలు చదివి ఎంతమంది బాగుపడ్డారు? లోకంలో ఎన్ని అంగుళాల మంచి జరిగింది? అంతా వెర్రి! లోకాన్ని భ్రమపెట్టడం" అని ఎవరో లోపలి అంతరాంతరాలనించి సణగడం మాత్రం మానరు. ఆ భావాన్ని ప్రయత్నించి లోపలికే నెట్టేస్తాడు. అంతా ప్రపంచకాన్నుద్ధరించడానికే" అనుకుని, కాలరు సర్దుకుంటాడు.

నిస్సహాయతతో తండ్రి యింటినించి గెంటినదానికి అర్థాలు తీయదు ఆ కళాహృదయం. "వాళ్ళ మొహం! అసలు కళంటే తెలుసుంటేనా? షెల్లీ, బైరన్, టాల్‌స్టాయ్, ఆస్కార్ వైల్డు, ఇంకా నెత్తిమీద వెంట్రుక లంతమంది కళారాధనకి జీవితాన్ని ధారపోయడం, కష్టాల్ని ఎదుర్కోడం, ఎరుగుంటేనా? అసలు వాళ్ళ జీవితాలంటో చదువుతేగా? కళాకోణంలోంచి చూడ్డం, ఆ హృదయవైశాల్యతా వాళ్ళకి తెలుస్తేనా?" అనుకుంటాడు; అదే కోణంలో వీక్షిస్తాడు. తన కవితా హృదయాన్నంతటినీ కేంద్రీకరించి.

తర్వాత పట్నం వెడతాడు. ఇన్నాళ్లు తను విడవకండా కంట్రిబ్యూట్ చేస్తున్న పత్రికలూ, పత్రికాధిపతులూ, తోటి రచయితలూ, తను సాహిత్య ప్రపంచంలో జీవించడానికి ఆమాత్రం ఆస్కారం చూపరని ఎట్లా అనుకుంటాడు?

చివరికి పట్నంలో ఒక చిన్న వుద్యోగంలో ఏ ప్రూఫ్ రీడరుగానో, లేకపోతే ఏ పత్రికకో సహాయ సంపాదకుడుగానో నియమింపబడతాడు. తనూహించుకున్న తోటి రచయితలూ అందరి మనుషుల్లాగే తోస్తారు. ఈర్ష్యలూ, కుశ్చితాలూ, ఆర్థికక్షోభా, లోటుపాట్లూ, సంకు చిత్వాలూ అందరిలోలానే వాళ్ళల్లోనూ వుంటాయి. తను అనుకున్నంత గొప్ప కళాజీవితమేమీ గడుపుతూండరు. పత్రికల గొప్పతనం ఏ గ్రామంలోనో ఒంటరిగా కనిపిస్తే ఎక్కువగా వుంటుంది గాని, అన్ని పత్రికల మధ్య ఏ ఒక్క పత్రికకీ వుండవల్సినంత విలువ వుండదు. తన రచనలు ప్రచురిస్తున్నా, అతను ఇదివరకటంత గొప్పగా అనుకోవడంలేదు. ఎందుకంటే వివిధరకాల మనస్తత్వాల మెట్లు దాటివచ్చిన రచనకుండే విలువ, తనంత తను ప్రచురించుకుంటుంటే కనుపించదు.

ఆర్నెలల్లోనే మనిషి పూర్తిగా మారిపోతాడు. తక్కిన రచయితలకుండే లక్షణాలు, కవితాలక్షణాలు అవలంబిస్తాడు. క్రమక్రమంగా - తల దువ్వకపోవడం; జుట్టుని చిత్తం వచ్చినట్టు పెరగనియ్యడం; లాల్చీలూ, కండువాలూ, పైజామాలు వెయ్యడం- అన్నీని. అప్పు డప్పుడు జరిగే కవితా సమావేశాలవల్ల చిన్ని వుపన్యాసకుడుగా కూడా అవుతాడు. రచనల్లో

ఎప్పుడో వొకటి చాన్సువల్ల మంచిది బయల్వెడలుతూంటుంది. పందొమ్మిదో శతాబ్దపు విదేశీ రచయితల్ని ఏకరుపెట్టకుండా వుండడు. బతికున్న రచయితల గొప్పతనాన్ని, ఎవరైనా సరే, ఎంత శక్తివంతులైనా సరే వొప్పుకోడు–కనీసం కథానికల్లోనైనా తన ఎడ్మైరర్ ఎవరన్నా రచయితని కొనియాడితే అతనిలో లోటుపాట్లు వెలికి చూపించి, అతని దురుద్దేశాన్ని పారదోలుతాడు. తోటి రచయితల్ని చదవకుండావుండడం కృషిచేస్తాడు. ఎవళ్ళయినా అడిగితే గాలిలో విమర్శించడం నేర్చుకుంటాడు, వాళ్ళనిగురించి.

ఈ లోపల ఇంటిదగ్గర తండ్రి మనోవ్యథతో కుంగి, కుంగి శల్యమై మరణిస్తాడు.

అతని నివాసాన్ని తెలుసుకున్న అతని భార్య, ఇన్నాళ్ళూ మామగారి నిర్బంధనం వూరుకుంది. మొదటిసారిగా భర్తకి వుత్తరం రాస్తుంది.

“జరిగినదానికి చాలా విచారంగా వుంది. మీకోసం కళ్ళు కాయలు కాస్తున్నాయి. మీ చెల్లెలు శశి, నిద్దట్లో మిమ్మల్నే కలవరిస్తోంది…మామగారు పోయారు… ఇంక మీరే శరణ్యం… దయయుంచి ఈ దీనురాలిని కరుణిస్తారు కదూ?…”

అట్లా నడుస్తుంది లేఖ!

దజనుత్తరాల ఫలితం తిట్టుకుంటో, వున్నవన్నీ అమ్మి భార్యనీ, చెల్లెల్నీ పట్నం తీసుకు వెళ్ళడం! కాని దారిపొడుగునా ఏదో యిబ్బందిగానే అనుకుంటాడు. ప్రస్తుత సమాజం నించున్న పునాదుల్నీ, తన తాత తండ్రుల్ని, మొగలాయీ దండయాత్ర ఆదిగా అంత:కలహాలతో దేశాన్ని అమ్ముకున్న భారతజాతినీ తిట్టుకుంటాడు.

“అస్తమానూ యిసిక తుపానులూ, ఎండగాడ్పూ తగిలే యీ విశాల ప్రపంచమనే ఎడారిలో కళారాధన బాటసారులకి ఒక ఒయాసిస్సు”

పట్నంలో కాపరం పెట్టిన కొన్నాళ్ళవరకూ జీవితం ఆనందంగానే గడిచింది. ఇన్నాళ్ళూ ఒంటరిగా, కళాదేవతని ఆరాధిస్తూ బతికినవాడు, తన సహచారిణి సహచర్యంలో మళ్లీ కొత్త ఆనందాన్నీ, భావోద్రేకాల్ని పొందాడు.

అతని రచనలుకూడా చక్కని సాంసారిక జీవనాన్ని ప్రతిబింబించేవి.

కాని ఒక సంగతి ఎవరమూ కాదనలేంది వుంది; ప్రజారచయితలుగా, ప్రజల కష్టసుఖాల్లో, పోరాటాల్లో, దినదిన సమస్యల్లో పాల్గొంటూ, వాటిని విడదీస్తూ, భౌతిక వాదోపలంభకులై జీవించే వాళ్ళెప్పుడూ తప్పటడుగులు వెయ్యరు. వాళ్ళ రచనలు వాళ్ళ ఆశయాల్ని నెరవేర్చి తీరుతాయి.

కాని ఆదర్శవాదం ఆశయంగా పెట్టుకుని, ఏ అచ్చాఫీసుల్లోనో, ఏ వున్నత భవనాల్లోనో కూచుని గాలిమేడలు కట్టే రచయిత లెప్పుడూ పల్టీ కొడతారు. ప్రజలతో, వాస్తవికతతో సంబంధంలేని కళారాధన వేరేలేదు. అట్లాంటిది ప్రజల కుపయోగించే బదులు అరాచరికానికి మాత్రమే దారి తీస్తుంది.

సరిగ్గా అతని జీవితంలోకూడా అదే జరుగుతుంది. కొందరి విదేశీ రచయితల అలవాట్లని చూసీ, తోటి కొందరి రచయితల జీవితాల్ని చూసీ, అరాచరికమే కళారాధన వున్నత పథమనుకుంటాడు.

మత్తుపానీయాల స్వీకారంతో కళారాధన క్లయిమాక్సు అందుకుంది.

అచ్చాఫీసులో ముట్టే రూపాయలూ, ఇంకా ఇతర రచనలమీద సంపాయించేవీకూడా ఏ మూలకీ చాలవు. తను యింటిదగ్గిరినించి తెచ్చిన డబ్బుకూడా ఖర్చయిపోతుంది. తాగుడు ఒకవ్యాధి. వ్యాధిలానే డబ్బునీ, మనిషినీకూడా తినేస్తుంది.

దానితో అతనికి చెప్పలేనంత ఆర్థిక దుస్థితి వస్తుంది. ఇంట్లో మిగతావీ, భార్య బాపతు నగలూ అమ్ముతాడు. అంతులేని నదీప్రవాహాన్ని గడ్డిపరక ఏ మాత్రం ఆపుతుంది? అట్లానే ఆ డబ్బు కూడా!

ఇంక పట్నంలోని స్నేహితులమీద దండయాత్ర సాగిస్తాడు. అందరిదగ్గరా అప్పులే! ఎవరూ దగ్గరకు రానీరు. రానిచ్చిన వాళ్ళు "అప్పు ఎప్పుడు తీరుస్తావు ?" అని అడుగుతారు, ఇంకా ఇవ్వడం మాట అటుంచి.

ఎప్పుడో ఒకసారి చెప్పి భార్య, శశిని మామయ్యగారింటికి పంపేస్తుంది, పరిస్థితంతా చెప్పి.

రోజుల తరబడి యింటికి రాడు. తాగి దారిలో ఎవళ్ళమీదనైనా పడితే తిడతారు. తన యిల్లనుకుని పరుల యింటికెడితే తంతారు.

చివరికి వుద్యోగభ్రష్టతకూడా ప్రాప్తిస్తుంది; "పోతన్న బీదవాడేగా!" అనుకుంటాడు.

పట్నంలో పరువుపోగా, ఇతర ప్రదేశాల్లో వున్న ఎడ్మైరర్సుమీద దాడి సాగిస్తాడు. కొత్తగా వచ్చిన రోజుల్లో, నిజస్థితి తెలీక కొందరు గౌరవించి సన్మానాలు చేసినా, అతని జీవితవిధానం చూసాక అసహ్యించుకుంటారు.

ప్రతీచోటా "అతనేదో రాస్తాడన్న మాటేగాని వట్టి తాగుబోతూ!" అనుకుని, అతన్ని చేరనియ్యరు.

స్వదేశ పట్టణాల సందర్శనానంతరం పట్నం చేరుతాడు. గెడ్డంకూడా మాస్తుంది. మాసిన బట్టలు చీకి, చినిగిపోతాయి.

భార్యబట్టకి నిప్పంటుకుని చచ్చిపోయినవాళ్ళల్లో ఒకత్తెగా దినపత్రికలో వస్తుంది- నిజానికి అది అతనికి తెలీదు. ఇంటివాళ్ళ బాధా, సంఘంలో అవమానం, తిండిలేక మాడిన కష్టానికీ, అన్ని బాధలకీ అతీతమవుదామని, ఆ లోకంలో భర్త కోసం ఎదురుచూడ్డానికి ఆవిడే చచ్చిపోతుంది, అంటించుకుని!

ఖాళీయిల్లు చూసి "ఎవళ్ళతోనో లేచిపోయుంటుంది. నాకోసం ఎన్నాళ్ళు చూస్తుంది? అనుకుంటాడు మత్తులో.

ప్రశాంతమైన బీచ్‌లోకి పోయి పడుక్కుంటాడు. అది వేసంకాలం!

ఏ రాత్రి ఒంటిగంటకో, ఆ సముద్రపు ఉప్పుగాలి అతని మత్తుని వదిలిస్తుంది. మెదడుని శుభ్రపరుస్తుంది. ఇహలోక స్ఫురణ కలుగుతుంది.

ఆ యిసికమీద పడుక్కునే ఆకాశాన్నీ, నక్షత్రాల్ని, నడిసముద్రాన్నీ, బూడిదరంగుతీరాన్నీ, అన్నిటినీ అవలోకిస్తాడు.

చిన్నతనంనించి తన జీవితాన్ని ఒకసారి తడిమి చూసుకుంటాడు. సంఘంలో తను మెలిగిన విధానం, కుటుంబంలో తను తెచ్చిన విచ్ఛిత్తూ, తను పొందిన అవమానాలూ, అన్నీ ఒక్కసారిగా మనస్సుని రంపపుకోత పెడతాయి. కళ్లు చెమ్మగిల్లుతాయి. ఉండుండి బావురుమని ఏడుస్తాడు. భార్య చచ్చిపోలేదు కద? ఏమో!

తండ్రికీ, భార్యకీ, ప్రజలకీ, చివరికి కళాదేవతకీ అన్యాయం చేసినట్టు అనుకుంటాడు. సముద్రంనించి తీరానికి వచ్చే ప్రతీ కెరటమూ అతన్ని ఆహ్వానిస్తున్నట్టవుతుంది.

లేచి వాటివైపు వెడతాడు, వాటి పిలుపుని అందుకున్నట్టు, అతని నేరాన్ని క్షమించిన తల్లిలా సముద్రం అతన్ని గర్భంలో యిముడ్చుకుంటుంది.

అతను మరణిస్తాడు; కాని అతను కళాజీవి!

*12.04.1947–ఆనందవాణి వారపత్రిక*